

ట్రంప్‌నకు గట్టి ఎదురుదెబ్బ 2

APTEL/2009/29308

స్నేహిత

# ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

05-06-2026
శుక్రవారం
హైదరాబాద్
సంపుటి: 17 I సంచిక: 221
పేజీలు: 04 I వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.expresstelugudaily.com



## భూసేకరణకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలి

ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలి

స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమన్వయం చేసుకోవాలి

ఈ బాధ్యతను జిల్లా కలెక్టర్లు సమర్థవంతంగా నిర్వహించాలి

- అవసరమైన నిధులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు విడుదల చేస్తుంది
- పాలమూరు ప్రాజెక్టుల పూర్తి కోసం వేగం పెంచాలి..
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టుల పనులపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- మక్తల్‌లో ఎత్తిపోతల పథకం పనులు పరిశీలించిన సీఎం
- నేడు జడ్చర్లలో నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగించనున్న రేవంత్ రెడ్డి

**మహబూబ్ నగర్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పాలమూరు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు వేగవంతమే లక్ష్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా గురువారం నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలం కాట్రేవులపల్లి పరిధిలో కొనసాగుతున్న మక్తల్‌నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను సీఎం, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ అధికారులతో వివిధ అంశాలపై సీఎం చర్చించి పలు సూచనలు చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని సీఎం రేవంత్, మంత్రులు తిలకించారు.

**అధికారులతో సమీక్ష..**

పాలమూరు ప్రాంతంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సీఎం రేవంత్ రెడ్డి గురువారం రాత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ అత్యంత కీలకమని పేర్కొన్న సీఎం, అది పూర్తి కాకుండా పనులు ముందుకు సాగడం సాధ్యం కాదని అన్నారు. అందుకే భూసేకరణ ప్రక్రియను తొలి ప్రాధాన్యంగా తీసుకుని ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమన్వయం చేసుకుంటూ భూసేకరణ పనులను ముందుకు తీసుకెళ్లాలని, ఈ బాధ్యతను జిల్లా కలెక్టర్లు సమర్థవంతంగా నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి భూసేకరణకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. భూసేకరణ కోసం అవసరమైన నిధులను ప్రభుత్వం..

మిగతా2లో...

## జైలు శిక్షలకు బీఆర్ఎస్ భయపడే ప్రసక్తే లేదు

- సింగరేణి కార్మికుల పొట్టగొడుతున్న కాంగ్రెస్ సర్కార్
- సింగరేణిలో రూ.1,600 కోట్ల బొగ్గు స్కామ్
- 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైంది
- ఈ భారీ స్కామ్‌పై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి సమగ్రమైన లేఖ రాస్తా
- ఇంత పెద్ద కుంభకోణం జరుగుతుంటే సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారు
- కేంద్రం-రాష్ట్రం సమాధానం చెప్పాలన్న కేటీఆర్



2

## ఏడు రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్

- 13 రాష్ట్రాల్లోని 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు
- ఈనెల 18న పోలింగ్.. అదేరోజు ఓట్ల లెక్కింపు

2



## ఖనిజాల వేటలో భారత్-బ్రిటన్

- క్రిటికల్ మినరల్స్ రంగంలో వ్యూహాత్మక భాగస్వామ్యం
- జీసీఎస్ఓ శాటిలైట్ కేంద్రాన్ని యూకే ఫారిన్ సెక్రటరీ ఇవెట్ కూపర్‌తో కలిసి ప్రారంభించిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి



2



## నాగేశ్వర్‌పై కేసులు ఎత్తివేయాలి

- అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం
- భావప్రకటన స్వేచ్ఛే ప్రజాస్వామ్యానికి పునాది: జస్టిస్ సుదర్శన్ రెడ్డి
- నాగేశ్వర్ గొంతును కాపాడుకోవాలి: కూనంనేని
- అభిప్రాయాలు అందరికీ నచ్చాల్సిన అవసరం లేదు: కోదండరాం
- ప్రజాస్వామ్యంలో అభిప్రాయ భేదాలు సహజమే: అద్దంకి దయాకర్
- భావప్రకటన స్వేచ్ఛను కాపాడాలి: కే.శ్రీనివాస్
- పవన్ కల్యాణ్ వెనుక బీజేపీ ఎజెండా: వీరయ్య
- సిరా ఇంకేవరకు రాస్తూనే ఉంటాను:ప్రొ.నాగేశ్వర్

2

## రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచే ఆలోచన లేదు

- నేటి నుంచి భూముల మార్కెట్ విలువలు పెంచుతున్నాం
- దీంతో ప్రభుత్వానికి రూ.1,400 కోట్ల ఆదాయం సమకూరుతుంది
- సబ్‌రిజిస్ట్రార్ల అధికారాలు చాలా వరకు తగ్గించాం : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



2

# నాగేశ్వర్‌పై కేసులు ఎత్తివేయాలి..

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** 'భావ ప్రకటన స్వేచ్ఛపై దాడి చేస్తే ఊరుకునేది లేదు. పవన్ కల్యాణ్ విద్వేషపూరిత వ్యాఖ్యలు సరికాదు. ప్రొఫెసర్ నాగేశ్వర్ పై రాజకీయదాడిని ఆపాలి. ఏపీలో నాగేశ్వర్ పై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలి' అని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బషీర్ బాగ్ లోని దేశోద్ధారక భవన్ లో గురువారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాజ్యాంగం హామీ ఇచ్చిన భావ ప్రకటన స్వేచ్ఛను గౌరవించుకుంటామని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సమావేశానికి హజరైన సభికులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ రాజకీయ విశ్లేషణపై ఏపీలో కొన్ని పార్టీలు, వారి సోషల్ మీడియా బృందాలు చేస్తున్న కక్షపూరిత దాడి, ట్రోలింగ్ ను ఈ అఖిల పక్ష సమావేశం తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం చేసింది. ఇప్పటికే నాగేశ్వర్ తన మాటలను ఉపసంహరించుకున్నా, విద్వేషపూరిత దాడి కొనసాగించడం సరికాదని, జనసేన ఆ అంశానికి ముగింపు పలికినట్లు ప్రకటించినప్పటికీ నాగేశ్వర్ పై ఆంధ్రప్రదేశ్ లో కేసులను ఎత్తివేయలేదని, తక్షణమే ఈ అంశానికి ముగింపు పలికి, నాగేశ్వర్ పై కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సభ అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రౌండ్ టేబుల్ సమావేశంఏకగ్రీవంగా ఆమోదించింది. భావ ప్రకటన స్వేచను పరిరక్షించాలని, ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య సామరస్య వాతావరణం పరిఢవిల్లాలని అఖిలపక్ష సమావేశం అభిప్రాయపడింది. రాజకీయ విశ్లేషకులు, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌పై జరుగుతున్న కక్ష పూరిత దాడులు, సోషల్ మీడియా ట్రోలింగ్స్, అక్రమ కేసులను రాష్ట్రంలోని రాజకీయ నాయకులు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ముక్తకంఠంతో ఖండించారు.

**భావప్రకటన స్వేచ్ఛే..**

**ప్రజాస్వామ్యానికి పునాది..**

ఈ సందర్భంగా జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ సత్యాన్వేషణ, భావప్రకటన స్వేచ్ఛే ప్రజాస్వామ్యానికి పునాది అన్నారు. భావప్రకటన స్వేచ్ఛ అనేది లేకపోతే ప్రజాస్వామ్యం మనుగడే సాధ్యం కాదన్నారు. 'ప్రజాస్వామ్యం ఎప్పుడూ భిన్నాభిప్రాయాలను ప్రోత్సహిస్తుంది. ఒకరి విశ్లేషణతో అందరూ ఏకీభవించాల్సిన అవసరం లేదు. కానీ, ఆ అభిప్రాయాన్ని చెప్పే హక్కును కాపాడటం సమాజ బాధ్యత' అని ఆయన స్పష్టం చేశారు.

**నాగేశ్వర్ గొంతును కాపాడుకోవాలి..**

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. నాగేశ్వర్ గొంతును కాపాడుకోవాలన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఒక విజ్ఞాన ఖని లాంటివారని, ప్రజా గొంతుకైన ఆయనను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఒక విశ్లేషణపై వివాదం చెలరేగినప్పుడు నాగేశ్వర్ పెద్ద మనసుతో తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నాక కూడా, దాన్ని ఇంకా పెద్ద వివాదంగా మార్చడం వెనుక ఉన్న రాజకీయ కుట్రలను అర్థం చేసుకోవాలన్నారు. పొరుగు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఇక్కడికి వచ్చి బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం, కమ్యూనిస్టులపై విమర్శలు చేయడం తగదన్నారు. తెలంగాణ సమాజం అందరినీ ప్రేమిస్తుందని, అయితే ఇక్కడి అస్థిత్వంపై దాడి చేస్తే ఊరుకోదని సాంబశివరావు స్పష్టం చేశారు.

**అభిప్రాయాలు అందరికీ నచ్చాల్సిన అవసరం లేదు..**

ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. భావ ప్రకటన స్వేచ్ఛను గౌరవించడం ప్రజాస్వామ్య సమాజానికి అత్యవసరమని అన్నారు. నాగేశ్వర్ వ్యక్తపరిచే అభిప్రాయాలు అందరికీ నచ్చాల్సిన అవసరం లేదని, విభేదాలు ఉంటే వాటిని చర్చల ద్వారా, ప్రత్యామ్నాయ అభిప్రాయాల ద్వారా వ్యక్తపరచాలని సూచించారు. అభిప్రాయ భేదాల పేరుతో దాడులకు దిగడం అన్యాయమని, అమానుషమని, అనాగరికమని ఆయన విమర్శించారు.

**నాగేశ్వర్‌ను అడ్డంపెట్టుకుని విద్వేషాలు..**

ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో అభిప్రాయ భేదాలు సహజమేనని, వాటిని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు. పవన్ కల్యాణ్ తెలంగాణకు రావడాన్ని ఎవరూ వ్యతిరేకించడంలేదని, అయితే తెలంగాణ ఉద్యమకారుల మనోభావాలను గౌరవించడం అవసరమన్నారు. నాగేశ్వర్ అంశాన్ని ఆధారంగా చేసుకుని రాజకీయ ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య విభేదాలు పెరిగేలా వ్యవహరించడం ఎవరికి మేలు చేయదన్నారు. తెలంగాణ ప్రజలు ప్రేమ, సహనానికి ప్రతీకలని, ద్వేష రాజకీయాలకు తావివ్వకూడదని దయాకర్ అన్నారు. జనసేనతో సహా అన్ని రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య పద్ధతుల్లో రాజకీయాలు చేయాలని, తెలంగాణ అస్తిత్వం, భావోద్వేగాలను గౌరవించాలని సూచించారు. వివాదాస్పద వ్యాఖ్యలు, పరస్పర ఆరోపణలకు ఇక ముగింపు పలికి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలన్నారు.

**భావప్రకటన స్వేచ్ఛను కాపాడాలి..**

సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రాంతీయవాదాన్ని జాతీయ భద్రతా సమస్యగా లేదా ఉగ్రవాదంతో పోల్చే వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరమని పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజాస్వామ్య చర్చలను దెబ్బతీస్తాయని, రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య అనవసర వైరుధ్యాలను సృష్టించే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలు సహజ మిత్రులని, వారి మధ్య విద్వేష సంబంధాలు లేవని స్పష్టం చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ ఒక రాజకీయ విశ్లేషకుడిగా తన అభిప్రాయాలను వెల్లడించారని, విశ్లేషకులు, జర్నలిస్టులను రాజకీయ ప్రత్యర్థులుగా భావించి లక్ష్యంగా చేసుకోవడం ప్రమాదకర ధోరణి అని విమర్శించారు. అభిప్రాయ భేదాలు ఉన్నా వాటిని చర్చల ద్వారా ఎదుర్కోవాలే తప్ప వ్యక్తిగత దాడులు, ట్రోలింగ్‌లు సమర్థనీయం కాదని పేర్కొన్నారు.

**పవన్ కల్యాణ్ వెనుక బీజేపీ ఎజెండా..**

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ ప్రొఫెసర్ నాగేశ్వర్ అంశం ఆంధ్రాతెలంగాణ పంచాయితీ కాదని, అది కేవలం మీడియా స్వేచ్ఛకు సంబంధించిన విషయమన్నారు. అయితే, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సరిగ్గా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజే ఇక్కడికి వచ్చి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం పుండు మీద కారం చల్లడమేనన్నారు. ముగిసిపోయిన ప్రాంతీయ విభేదాలను మళ్లీ రగల్చడం ద్వారా ఇక్కడి ఓట్లను చీల్చి రాజకీయ లబ్ది పొందాలనేది బీజేపీ వ్యూహమని, ఆ ఎత్తుగడలో పవన్ కల్యాణ్ ఒక పాచికగా మారారని విమర్శించారు.

**సిరా ఇంకేవరకు రాస్తూనే ఉంటాను..**

ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ మాట్లాడుతూ గత 15 రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో అన్ని ప్రజాసమస్యలను పక్కనపెట్టి తన చుట్టూనే చర్చలు నడపడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, రైల్వే జోన్ లాంటి కీలక అంశాలపై చర్చించని మీడియా ఛానళ్ళు, తనపై గంటల తరబడి చర్చలు పెట్టడం వెనుక ఉన్న అధికార వర్గాల విశృంఖలత్వాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. 'నా మాటల్లో ఎక్కడా కుల ప్రస్తావన గాని, అల్లర్లు రేపే ఉద్దేశం లేదు. అయినా హైకోర్టులు కొట్టేసిన సెక్షన్లను నాపై ప్రయోగించారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ నేను భయపడను. పదవుల కోసమో, ప్రలోభాల కోసమో నేను మాట్లాడటం లేదు. ప్రజాపక్షాన నిలబడటమే నా బాధ్యత. నా గొంతులో ప్రాణం ఉన్నంత వరకు, నా పెన్నులో సిరా ఇంకేవరకు నేను రాస్తూనే ఉంటాను. మాట్లాడుతూనే ఉంటాను. తప్పితే ఎలాంటి నిర్బంధాలకూ లొంగే ప్రసక్తే లేదు' అని నాగేశ్వర్ స్పష్టం చేశారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు సాధినేని వెంకటేశ్వర్లు, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ నాయకురాలు రమ మాట్లాడుతూ.. నాగేశ్వర్‌పై పెట్టిన అన్ని అక్రమ కేసులను ప్రభుత్వం బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. భిన్నాభిప్రాయాలను గౌరవించే ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య వాతావరణాన్ని కాపాడుకోవడానికి, రాజ్యాంగ పరిరక్షణకు తెలుగు నేలపై అందరూ కలిసికట్టుగా ఉద్యమించాలని కోరారు.

## భూసేకరణకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎప్పటికప్పుడు విడుదల చేస్తుందని హామీ ఇచ్చారు. పాలమూరు ప్రాజెక్టుల పూర్తి ద్వారా సాగునీటి సౌకర్యాలు మెరుగుపడి రైతులకు గణనీయమైన ప్రయోజనం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. శుక్రవారం ల్లాపూర్ మండలంలోని ఎల్లూరు పంప్ హౌస్‌కు సీఎం చేరుకుంటారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీ3 హెడ్ రెగ్యులేటర్ ప్యాకేజీ2 నార్లాపూర్ రిజర్వాయర్ ప్యాకేజీ1 డెలివరీ సిస్టర్న్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం లిఫ్ట్1 పంప్ హౌస్‌లను పరిశీలిస్తారు. నాగర్ కర్నూల్ జిల్లా వట్టెం రిజర్వాయర్ పరిశీలన అనంతరం మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని కొత్తూరు హెలిప్యాడ్ కు చేరుకుంటారు. అనంతరం పీఆర్ఎల్ఐలోని కరివెన రిజర్వాయర్ ప్యాకేజీ14, 15 పనులను పరిశీలిస్తారు. జడ్చర్ల మండలం ఉద్దండాపూర్ హెలిప్యాడ్ కు చేరుకుంటారు. అక్కడ ప్యాకేజీ 17, 18 పనుల పురోగతి పై అధికారులను అడిగి తెలుసుకుంటారు. అనంతరం జడ్చర్లలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.

## పంజాబ్‌లో సెక్యూరిటీ అలర్ట్..

**నేషనల్ బ్యూరో :** పంజాబ్‌లోని ఐదు ప్రముఖ దేవాలయాలకు గురువారం బాంబు బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. కొన్ని ప్రభుత్వ సంస్థల్లో కూడా పేలుళ్లు జరుపుతామని ఆ ఈమెయిల్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దాంతో అప్రమత్తమైన వారు ఆ ఆలయాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. మరో రెండు రోజుల్లో ఆపరేషన్ బ్లూ స్టార్‌కు 42 ఏళ్లు పూర్తికానున్న నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

అమృత్‌సర్‌లోని దుర్గియానా ఆలయం, పఠాన్‌కోట్‌లోని ముక్తేశ్వర్ ధామ్ ఆలయం, జలంధర్‌లోని దేవీ తలాబ్ మందిర్, భటిండాలోని మైసర్ ఖానా ఆలయం, పటియాలాలోని మాతాకాళీ ఆలయానికి ఈ బెదిరింపులు వచ్చాయి. ఆపరేషన్ బ్లూస్టార్ కు 42 ఏళ్ల కావొస్తుండటంతో ఇప్పటికే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు.. ఈ బెదిరింపు మెయిల్‌తో మరింత అప్రమత్తమయ్యారు. ఇప్పటికే దేవీ తలాబ్ ఆలయం వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు గుర్తించలేదని వెల్లడించారు. ప్రజలను భయపెట్టే ఉద్దేశంతో చేసిన నకిలీ బెదిరింపులుగా కనిపిస్తున్నప్పటికీ.. ఎలాంటి రిస్క్ తీసుకోబోమన్నారు. 1984 జూన్‌లో ఆపరేషన్ బ్లూ స్టార్ కొనసాగింది. ప్రార్థనాలయంలో దాక్కున్న తీవ్రవాదులను పట్టుకునేందుకు భారత సైన్యం సైనిక చర్య చేపట్టింది. మేజర్ జనరల్ బ్రార్ ఆధ్వర్యంలో కొనసాగిన ఈ 'ఆపరేషన్ బ్లూ స్టార్'.. భారత సైన్యం చేపట్టిన అతిపెద్ద సైనిక చర్యల్లో ఒకటిగా నిలిచింది. అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఆదేశాల మేరకు చేపట్టిన ఆ సైనిక చర్యలో 83 మంది భారత సైనికులు అమరులయ్యారు. వేర్పాటువాద నేత భింద్రన్ వాలేతో పాటు ఇతర వేర్పాటువాద నేతలూ హతమయ్యారు.

## ట్రంప్‌నకు గట్టి ఎదురుదెబ్బ

**నేషనల్ బ్యూరో :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై సైనిక చర్యలు నిలిపివేసే తీర్మానానికి అమెరికా ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. ఈ తీర్మానానికి 215 మంది అనుకూలంగా.. 208 మంది వ్యతిరేకంగా ఓట్లు వేశారు. అనవసర, భారీ ఖర్చుతో కూడిన యుద్ధానికి వెంటనే ముగింపు పలకాలని ప్రతినిధులు డిమాండ్ చేశారు. హౌస్ ఫారిన్ అఫైర్స్ కమిటీలో సీనియర్ సభ్యుడైన న్యూయార్క్ డెమోక్రటిక్ ప్రతినిధి గ్రెగొరీ మీక్స్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ప్రతినిధుల సభలో నిర్వహించిన ఓటింగ్‌లో నలుగురు రిపబ్లికన్‌లు ట్రంప్ సైనిక చర్యలకు వ్యతిరేకంగా ఓటు వేయడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ అధికారికంగా యుద్ధం ప్రకటిస్తేనో, సైనిక చర్యలకు ఆమోదం ఇస్తే తప్ప.. అమెరికా బలగాలు ఇరాన్ పై ఎలాంటి దూకుడు చర్యలకు దిగకూడదని ఈ తీర్మానం ట్రంప్‌ను ఆదేశిస్తుంది. అమెరికా ప్రతినిధుల సభ 'వార్ పవర్స్ రిజల్యూషన్'ను ఆమోదించడం వైట్‌హౌస్‌కు పెద్ద దెబ్బ. అయితే, ఇరాన్‌తో మూడు నెలలుగా కొనసాగుతోన్న సంఘర్షణను ఇది తక్షణమే ముగిస్తుందని చెప్పలేం. స్వల్ప తేడాతో ఆమోదం పొందిన ఈ తీర్మానంతో ఇరాన్‌పై ట్రంప్ చర్యలకు వ్యతిరేకత వ్యక్తమైందనే విషయం స్పష్టమవుతుంది. ఇప్పుడు ఈ యుద్ధ అధికారాల తీర్మానం సెనెట్‌కు వెళ్తుంది. అక్కడ దీనికి ఆమోదం లభిస్తే.. ఆ తర్వాత అది అధ్యక్షుడు ట్రంప్ వద్దకు చేరుతుంది. ఆయన దీనిని వీటో చేయవచ్చు.

## రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచే ఆలోచన లేదు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణలో శుక్రవారం నుంచి భూముల మార్కెట్ విలువలు పెంచుతున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని చెప్పారు. మీడియాతో ఆయన చిట్ చాట్‌గా మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం నుంచి నిధులు రాకపోతే రాష్ట్ర ప్రభుత్వమే చివరి బిల్లు కూడా చెల్లిస్తుందన్నారు. ''భూముల మార్కెట్ విలువలు 50 నుంచి 100 శాతం పెంచుతాం. దీంతో ప్రభుత్వానికి రూ.1,400 కోట్ల ఆదాయం సమకూరుతుంది. శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, ఖాజాగూడ వంటి ప్రాంతాల్లో అధిక పెంపు ఉంటుంది. రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచే ఆలోచన లేదు. సబ్‌రిజిస్ట్రార్ల అధికారాలు చాలా వరకు తగ్గించాం. మార్కెట్ విలువల పెంపుతో భూసేకరణ వేళ ప్రభుత్వంపై భారం పడుతుంది. ప్రజల ఫిర్యాదుల స్వీకరణకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తాం. ఫ్యూచర్ సిటీని రద్దు చేసే అవకాశమే ఉండదు. నాకు ఏ శాఖ ఇచ్చినా పనిచేస్తా. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇళ్లకు రూ.7వేల కోట్లు చెల్లించాం. బీఆర్ఎస్ హయాంలో అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. మా ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితాలో పెట్టింది. త్వరలో తహసీల్దార్ల బదిలీలు జరుగుతాయి'' అని పొంగులేటి తెలిపారు.

## తెలంగాణ ఈగల్ పోలీసుల మెగా ఆపరేషన్

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణలో డ్రగ్స్ మాఫియాపై కొరడా ఝులిపించారు ఈగల్ పోలీసులు. అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టు చేస్తూ సంచలన ఆపరేషన్ చేపట్టారు. థాయ్‌లాండ్ నుంచి ఇండియాకు గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న కోట్ల రూపాయల హైడ్రోపోనిక్ గంజాయి రవాణాను ఈగల్ ఫోర్స్ విజయవంతంగా అడ్డుకుంది. ఈ భారీ నెట్‌వర్క్‌కు నేతృత్వం వహిస్తున్న ఒక కీలక విదేశీ మహిళతో పాటు, మొత్తం 10 మంది డ్రగ్ పెడ్లర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుండి అంతర్జాతీయ మార్కెట్లో సుమారు 12 కోట్ల రూపాయల విలువ చేసే భారీ హైడ్రోపోనిక్ గంజాయిని ఈగల్ టీం స్వాధీనం చేసుకుంది. గత నెల రోజులుగా అత్యంత రహస్యంగా, పక్కా ప్లానింగ్‌తో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించిన ఈగల్ ఫోర్స్.. ఎట్టకేలకు ఈ అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠా నెట్‌వర్క్‌ను పూర్తిగా ఛేదించింది. ఈ భారీ ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను, నిందితుల ముఠా గుట్టును వివరిస్తూ.. జూన్ 4 మధ్యాహ్నం 12 గంటలకు తెలంగాణ ఈగల్ పోలీసులు అధికారికంగా మీడియా సమావేశం నిర్వహించనున్నారు.

## ఖనిజాల వేటలో భారత్-బ్రిటన్



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** భారత్-యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య క్రిటికల్ మినరల్స్ రంగంలో వ్యూహాత్మక భాగస్వామ్యం మరొక కీలక మైలురాయి చేరుకుంది. 2025లో ప్రధాని మోదీ, యూకే ప్రధాని కీర్ స్టార్మర్ ద్వైపాక్షిక భేటీ సందర్భంగా క్రిటికల్ మినరల్స్ సప్లయ్ చైన్ అబ్జర్వేటరీ ఏర్పాటు చేస్తామని చెప్పిన నేపథ్యంలో తాజాగా ఈ కేంద్రం ప్రారంభమైంది. గురువారం భారత్-యూకే క్రిటికల్ మినరల్స్ గ్లోబల్ సప్లయ్ చైన్ అబ్జర్వేటరీ (జీసీఎస్ఓ) శాటిలైట్ కేంద్రాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, యూకే ఫారిన్ సెక్రటరీ ఇవెట్ కూపర్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా సురక్షితమైన, స్థిరమైన, విశ్వసనీయమైన క్రిటికల్ మినరల్స్ సప్లయ్ చైన్ వ్యవస్థ నిర్మాణంలో ఈ అబ్జర్వేటరీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. క్లీన్ ఎనర్జీ, ఆధునిక సాంకేతికతలు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో క్రిటికల్ మినరల్స్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు వెన్నెముకగా మారుతున్నాయని... ప్రపంచంలోని అతిపెద్ద డిజిటల్ మెటీరియల్ ఫ్లో మ్యాప్ రూపకల్పనలో ఈ అబ్జర్వేటరీ ముఖ్య కేంద్రంగా నిలవనుందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో క్రిటికల్ మినరల్స్ రంగంలో స్వావలంబనకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఈ లక్ష్యంతోనే 4 బిలియన్ డాలర్ల జాతీయ క్రిటికల్ మినరల్స్ మిషన్‌ను ప్రారంభించాం. మినరల్స్ వెలికితీత, ఎక్స్‌ప్లొరేషన్, ప్రాసెసింగ్, రీసైక్లింగ్, ఇన్నొవేషన్స్ వంటి విషయాల్లో వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ఈ మిషన్ ప్రధాన ఉద్దేశమన్నారు.

## ఏడు రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్

**నేషనల్ బ్యూరో :** రాజ్యసభ ఎన్నికల్లో భాగంగా ఏడు స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. కర్ణాటక నుంచి ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు పవన్ ఖేరా, మన్సూర్ అలీఖాన్ పేర్లను నామినేట్ చేసింది. మధ్యప్రదేశ్ నుంచి మీనాక్షి నటరాజన్, రాజస్థాన్ నుంచి నీరజ్ డాంగి, తమిళనాడు నుంచి ప్రవీణ్ చక్రవర్తి, ఝార్ఖండ్ నుంచి ప్రణవ్ ఝా పేర్లను ఎంపిక చేసింది. 13 రాష్ట్రాల్లోని 27 రాజ్యసభ స్థానాలకు ద్వైవార్షిక, ఉప ఎన్నికలకు సంబంధించి ఈసీ ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. జూన్, జులైలో ఖాళీ అవుతున్న ఆంధ్రప్రదేశ్(4), గుజరాత్(4), కర్ణాటక(4) మధ్యప్రదేశ్(3), రాజస్థాన్(3), ఝార్ఖండ్(2), మణిపూర్(1), మేఘాలయ(1), అరుణాచల్‌ప్రదేశ్(1), మిజోరం(1)ల్లోని స్థానాలతోపాటు తమిళనాడు, మహారాష్ట్ర, ఒడిశాల్లో ఇప్పటికే ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 18న పోలింగ్ నిర్వహించనున్నారు. అదేరోజు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితం వెల్లడిస్తారు.

## 150 ఏళ్లలో ఇవే అత్యంత దారుణమైన రుతుపవనాలు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఎక్కువగా వర్షాధారిత వ్యవసాయం చేసే మన దేశానికి రెండేళ్ల వరకు సూపర్ ఎల్‌నినో కారణంగా గడ్డు కాలమే ఉండనుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో సూపర్ ఎల్‌నినో బలపబడుతోందని, భారతదేశానికి వ్యవసాయ, ఆర్థిక ముప్పు వాటిల్లనుందని 'క్లైమేట్ ట్రెండ్స్' నివేదించింది. రానున్న రోజుల్లో దేశ వాతావరణ పరిస్థితుల ప్రభావం గురించి ఈ నివేదిక వివరణ ఇచ్చింది. ఇప్పటికే వర్షాభావ ప్రభావంతో భారత్ సతమతమవుతుండగా ఎల్‌నినో సూపర్ ఎల్‌నినోగా రూపాంతరం చెందడం అతిపెద్ద ప్రమాదమని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

**అత్యంత వేడి సంవత్సరంగా 2026..**

సూపర్ ఎల్‌నినో వల్ల నైరుతి రుతుపవనాలు సకాలంలో ప్రవేశించకపోవడమే కాకుండా, అనిశ్చితి నెలకొంటుంది. వర్షానికి వర్షానికి మధ్య దూరం (లాంగ్ డ్రైస్పెల్స్), తక్కువ వర్షపాతం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఎల్‌నినో ప్రభావం ఈ ఏడాదితో ముగిసిపోకుండా 2027లోనూ ఉండొచ్చని నివేదికలు చెబుతున్నాయి. రెండేళ్ల పాటు ఎల్‌నినో కొనసాగడం చాలా అరుదు. ఇది వరకు దేశ చరిత్రలో అత్యంత వేడి సంవత్సరంగా 2024కు రికార్డు ఉంది. తాజా పరిస్థితులను గమనిస్తుంటే దాన్ని 2026 అధిగమించవచ్చు.

**నీటి ఎద్దడి తీవ్రతరం..**

మన దేశంలో 52శాతం సాగుకు వర్షాలే ఆధారం. రుతుపవనాల్లో అంతరాయం కారణంగా వ్యవసాయ రంగం తీవ్ర సమస్యలను ఎదుర్కోనుంది. దీనికి తోడు ఎరువుల కొరత, ఇంధన ధరలు పెరిగిపోతుండటం రానున్న ఖరీఫ్ సీజన్‌కు మరింత ముప్పుగా పరిణమించవచ్చు. వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భజలాలు పుంజుకోవడం, జలాశయాల్లో నీటి మట్టం తగ్గడంతో పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ నీటి ఎద్దడి పెరగనుండటం ఆందోళన కలిగిస్తుంది.

**నివేదికలో పేర్కొన్న మరిన్ని ప్రధానాంశాలు..**

ఈ సంవత్సరం ఆఖరులోగా దేశంలో అతిబలమైన ఎల్‌నినో ఏర్పడే అవకాశాలున్నాయి. 1950 నుంచి ఇప్పటిదాకా ప్రపంచవ్యాప్తంగా 1982, 1991, 1997, 2015లో ఇలాంటి సూపర్ ఎల్‌నినోలు ఏర్పడ్డాయి. 1982లో 2.5 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. 1951 నుంచి ఏర్పడిన ఎల్‌నినోల్లో 60శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఎల్‌నినో వల్ల రుతుపవనాలు బలహీనపడటంతో ఆహారం, జల విద్యుత్ ఉత్పత్తితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుంది. దేశ నైరుతిలో వర్షపాతం తక్కువగా నెలకొంటుంది. తేమతో కూడిన గాలి పై దిశకు వెళ్లకుండా తూర్పు, పడమర గాలి వలయాలు అడ్డుకుంటాయి. దీంతో నైరుతి రుతుపవన వర్షాలు తక్కువగా కురుస్తాయి.



## జైలు శిక్షలకు బీఆర్ఎస్ భయపడే ప్రసక్తే లేదు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** 'గతంలో మల్కాజ్‌గిరి ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి.. సీఎం అధికారిక నివాసమైన ప్రగతి భవన్‌ను బాంబులు పెట్టి పేల్చేసినా తప్పు లేదు అన్నప్పుడు ఆయన శిక్షార్హుడు కాదా? హైదరాబాద్ పాతబస్తీపై సర్జికల్ స్ట్రైక్ చేస్తామన్న ప్రస్తుత కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై ఎందుకు చర్యలు లేవు? బాల్క సుమన్‌పై పెట్టిన సెక్షన్లు ఆయనకు వర్తించవా?' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. చంచల్‌గూడ జైలులో ఉన్న బాల్క సుమన్‌ను బీఆర్ఎస్ నేతలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సుధీర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి కేటీఆర్ గురువారం ములాకత్ అయ్యారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడారు. సిద్దిపేటలో హరీశ్‌రావు క్యాంప్ ఆఫీస్ మీద దాడి చేసి పెట్రోల్ పోసి తగలబెడతా అన్న కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావుపై.. అలాగే ఒక కంపెనీని తగలబెడతా నన్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిపై చట్టం ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. కేవలం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, సింగరేణి సంస్థలో జరుగుతున్న వేల కోట్ల రూపాయల బొగ్గు కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి నుంచి మళ్లించేందుకే బాల్క సుమన్‌ను అక్రమ కేసులతో జైలులో పెట్టారని మండిపడ్డారు. ప్రభుత్వ అక్రమాలకు, జైలు శిక్షలకు బీఆర్ఎస్ భయపడే ప్రసక్తే లేదని, సింగరేణి కార్మికుల పొట్టగొడుతున్న కాంగ్రెస్ సర్కార్‌ను గల్లా పట్టి నిలదీస్తామని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి బావమరిది సృజన్‌రెడ్డి కనుసన్నల్లో సైట్ విజిటేషన్ సర్టిఫికేట్ పేరిట జరిగిన రూ.15,000 కోట్ల కుంభకోణాన్ని బీఆర్ఎస్ బహిర్గతం చేసిందన్నారు. అలాగే.. సోలార్ టెండర్లలో జరిగిన వందల కోట్ల అక్రమాలను బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బయటపెట్టారని గుర్తుచేశారు. నైనీ బొగ్గు టెండర్ వ్యవహారంలో మంత్రులకు, ముఖ్యమంత్రికి మధ్య వాటాలు కుదరక, చివరకు మీడియా ప్రతినిధులను అరెస్ట్ చేసే వరకు వెళ్లారని, ఆ తర్వాత సదరు టెండర్‌ను రద్దు చేయాల్సి వచ్చిందని వివరించారు. సింగరేణి కార్మికుల పొట్టగొడుతున్న సర్కార్ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) సమావేశంలో సింగరేణి సంస్థలో జరుగుతున్న అన్యాయాలపై బాల్క సుమన్ కార్మికుల పక్షాన నిలబడి గళమెత్తారని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో మెడికల్ ఇన్వాలిడేషన్ బోర్డు ద్వారా 19 వేల వారసత్వ ఉద్యోగాలు ఇస్తే, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 11 నెలలుగా బోర్డు మీటింగులు పెట్టకుండా వేలాది మంది కార్మిక బిడ్డలకు అన్యాయం చేస్తున్నదని ధ్వజమెత్తారు. పైగా గతంలో ఇచ్చిన 19 వేల ఉద్యోగాలపై విజిలెన్స్ ఎంక్వైరీ జరిపిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రకటించి కార్మికుల్లో కలవరం రేపారని మండిపడ్డారు. కార్మికుల ఆక్రోశాన్ని చూసి చలించిపోయిన బాల్క సుమన్ మాట్లాడిన మాటలను వక్రీకరించి, సింగరేణిలో జరుగుతున్న అసలు దోపిడీని కప్పిపుచ్చడానికే ఆయనపై అక్రమంగా పీడీపీపీ యాక్ట్ కింద కేసులు పెట్టి జైలుకు పంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల అత్యుత్సాహాన్ని కోర్టు కూడా మందలించి, సదరు సెక్షన్లను తొలగించిందని గుర్తుచేశారు. సింగరేణిలో బడా బాబుల ఆధ్వర్యంలో మైనింగ్ చేయని బొగ్గును చేసినట్టుగా రికార్డులు సృష్టించి రూ.1,600 కోట్ల మేర గోల్‌మాల్ చేశారని, 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైందని కేటీఆర్ ఆరోపించారు. సింగరేణిలో 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తున్నదని ప్రశ్నించారు. ఈ భారీ స్కామ్‌పై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి సమగ్రమైన లేఖ రాస్తానని వెల్లడించారు. ఇంత పెద్ద కుంభకోణం జరుగుతుంటే సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు.



## విలైక్ మేకప్ & హెయిర్ అకాడమీ బ్యూటీ ఛాంపియన్‌షిప్, మెగా బ్యూటీ ఫెస్ట్-2026

**అతిథులుగా హాజరైన అందాల తారలు దివి, పాయల్ రాజ్ పుత్, ముమైత్ ఖాన్**

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** అందాల రంగంలోని ప్రతిభావంతులను ప్రోత్సహిస్తూ, పరిశ్రమ అభివృద్ధికి వేదికగా నిలిచిన విలైక్ బ్యూటీ ఛాంపియన్‌షిప్ 2026 మరియు మెగా బ్యూటీ ఫెస్ట్ 2026 యూసఫ్ గూడ లోని సౌర్య కన్వెన్షన్ లో ఘనంగా నిర్వహించారు. ముమైత్ ఖాన్ ఆధ్వర్యంలోని విలైక్ మేకప్ & హెయిర్ అకాడమీ నిర్వహించిన ఈ కార్యక్రమానికి 300 మందికి పైగా హాజరుకాగా లైవ్ లో వారికి సెషన్స్ నిర్వహించి సరైన పద్ధతులను వివరించారు. మే 28న విలైక్ అకాడమీలో నిర్వహించిన బ్యూటీ ఛాంపియన్‌షిప్‌లో మేకప్, హెయిర్ స్టైలింగ్, ఎయిర్‌బ్రష్ మేకప్, పీఎంయూ, నెయిల్ ఆర్ట్, చీర కట్టింపు విభాగాల్లో పోటీలు జరిగాయి. విజేతలకు సర్టిఫికెట్లు, గుర్తింపు, నెట్‌వర్కింగ్ అవకాశాలు లభించాయి. జూన్ 4న యూసుఫ్‌గూడలోని శౌర్య కన్వెన్షన్ హాల్‌లో జరిగిన మెగా బ్యూటీ ఫెస్ట్‌లో సినీ నటి పాయల్ రాజ్‌పుత్, దివి గాయకుడు రోల్ రిడా, నటి చాందిని భగవానాని, ముమైత్ ఖాన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమానికి అరియానా గ్లోరీ, శివ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రముఖ హెయిర్ స్టైలిస్ట్ జావెద్ హబీబ్ ప్రత్యక్ష హెయిర్ కట్, స్టైలింగ్ ప్రదర్శన నిర్వహించగా, ధరణి అశోక్, కుబ్రా మక్దూమ్, రామాయణం పూజిత తదితర నిపుణులు ప్రత్యేక సెషన్లు నిర్వహించారు. బ్యూటీ ఛాంపియన్‌షిప్‌లో గెలిచినవారికి అవార్డులు, సర్టిఫికెట్లు నేడు అందజేశారు. అందాల రంగంలో ప్రతిభ, విద్య, వ్యాపార అవకాశాలు, నెట్‌వర్కింగ్‌ను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకురాలు, విలైక్ మేకప్ & హెయిర్ అకాడమీ అధినేత ముమైత్ ఖాన్ తెలిపారు.

స్నేహిత ఎక్స్‌ప్రెస్
05-06-2026
శుక్రవారం
హైదరాబాద్
expresstelugudaily.com


# కోహిర్ మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం!

- కోహిర్ మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్
- కోహిర్ పట్టణంలో 99,రోజుల ప్రణాళిక సమావేశం
- కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ శశిధర్, వైస్ చైర్మన్ హన్నాన్ జావీద్




**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కోహిర్ పట్టణంలో 99,రోజుల ప్రణాళికలో భాగంగా సమావేశం నిర్వహించడం జరిగింది.రాష్ట్రంలోని పట్టణ రూపురేఖలు మార్చే దిశగా ప్రభుత్వం ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది.మున్సిపాలిటీ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్య మెరుగుదలే లక్ష్యంగా 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రకటించింద అన్నారు .ఈ నెల 6 నుంచి మే 31 వరకు ఏ రోజు ఏ పని పూర్తి చేయాలో స్పష్టమైన గడువు విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని దానిలో భాగంగా పట్టణంలో అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని కోహిర్ మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు.ఈ సమావేశంలో భాగంగా ఆయన మాట్లాడుతూ..ప్రజా సమస్యలను పరిష్కరించడం, ప్రభుత్వ సేవలను ప్రజలకు సమర్థంగా అందించడం వంటి లక్ష్యాలతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది అన్నారు. గ్రామ పంచాయతీ నుంచి జిల్లా స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత, కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, ప్రజారోగ్యం, రోడ్డు భవన నిర్మాణాలు, రైతు సంక్షేమం, వ్యవసాయం, విద్య, యువత, క్రీడలు, మహిళల అభ్యున్నతి, పర్యావరణం తదితరలు అంశాలు ఇందులో ఉన్నాయని అన్నారు రాబోయే రోజుల్లో కోహిర్ మున్సిపాలిటీని అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తామని అన్నారు.అయితే ఈ యాక్షన్ ప్లాన్ లో భాగంగా ముఖ్యంగా ప్రభుత్వం నిర్వహించిందని అన్నారు.ఈ కార్యక్రమంలో కోహిర్ మున్సిపల్ కౌన్సిలర్లు,మున్సిపల్ సిబ్బంది అధికారులు,నాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



## ఉమ్మడి మండలాలలో ప్రారంభమైన ప్రత్యేక గ్రామసభలు

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ లో భాగంగా గ్రామాలలో ప్రత్యేక గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన ఆదేశాలకు అనుగుణంగా మొదటి రోజు కోటగిరి, పోతంగల్ మండలాలలోనీ ఆయా గ్రామాలలో ప్రత్యేక గ్రామ సభలు విజయవంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక సర్పంచ్ల అధ్యక్షతన ఉన్నతాధికారుల సమాలోచనల మేరకు ఈ గ్రామసభల సమావేశాలు దిగ్విజయంగా కొనసాగాయి.రానున్న వర్షాకాల దృశ్య ప్రజలకు నిర్దేశించిన సమాచార వ్యాప్తి ప్రణాళిక అలాగే స్థానిక అధికారులు సిబ్బంది అమలు చేయాల్సిన కార్యచరణ వంటి ఏడు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా గ్రామ సభలో విపులంగా చర్చించారు.ఈ గ్రామ సభ వేదికగా వర్షాకాల సన్నదత,సురక్షిత త్రాగునీరు,ఘన వ్యర్థాల నిర్వహణ,జల సంరక్షణ మన సంరక్షణ,మొక్కల పెంపకంలో భాగంగా వన మహోత్సవం, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, వరద నిర్వహణ భద్రత వంటి 7 ఎజెండా అంశాలపై విపులంగా చర్చించారు.ఈ కార్యక్రమంలో డిఎస్ఓ అరవింద్ రెడ్డి, ఎమ్మార్వోలు సందీప్,గంగాధర్,రుద్రూర్ సర్కిల్ సిఐ కృష్ణ,ఎస్ఐ సునీల్,ఎంపీడీ వోలు విష్ణు,చందర్ నాయక్,ఏవోలు రాజు,నిషిత,ఏపిఎం భాస్కర్,ఐసిడిఎస్ సూపర్వైజర్లు,ఆయా గ్రామాల సర్పంచు లు,కార్యదర్శులు,అధికారులు, నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

## జాతీయ జెండాను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి




**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజక వర్గం వర్ని మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాకు అవమానం జరిగింది.జాతీయ జెండా నమూనాతో పోలివున్న కేకును మార్కెట్ కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు జాతీయ జెండాను అవమాన పరిచేవిధంగా కట్ చేసి తెలంగాణ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు.దేశ త్రివర్ణ పథకాన్ని అవమానించేలా వ్యవహరించిన వీరందరిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోటగిరి మండల బిజెపి నాయకులు గురువారం కోటగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదు చేసిన వారిలో కోటగిరి మండల బిజెపి పార్టీ అధ్యక్షులు ఏముల నవీన్,మండల బీజేపీ పార్టీ ప్రధాన కార్యదర్శి వడ్ల శ్యామ్,బీజేపీ పార్టీ బూత్ అధ్యక్షులు మామిడి శ్రీనివాస్,బిజెపి పార్టీ సీనియర్ నాయకులు పుల్లల మోహన్ రావు,హౌగిరావ్ దేశాయ్, నాగేల్లి శ్రీనివాస్ గుప్తా,మామిడి సాయిలు, పత్తి సతీష్,తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

- బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు బి.శ్రీను
- మరణించిన వ్యక్తి వయస్సు 18 నుండి 59 సంవత్సరాల మధ్య ఉండాలి



**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (యన్.యఫ్.బి.ఎస్) కుటుంబంలో ప్రధాన ఉపాధి సంపాదించే వ్యక్తి మరణించినప్పుడు,ఆ కుటుంబానికి ₹20,000 ఆర్థిక సహాయం అందజేయబడుతుంది అన్నారు. మరణించిన వ్యక్తి వయస్సు 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు.కుటుంబం పేదరిక రేఖ కింద (బీపీయల్ ) ఉండాలి. దరఖాస్తు చేసిన వ్యక్తికి ఆధార్ కార్డు తప్పనిసరి. మరణించిన వ్యక్తికి ఆదాయ వనరులు లేకపోతే అర్హత ఉంటుంది.కుటుంబ సభ్యులు సమీపంలోని మీ సేవా కేంద్రం / గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోలి అన్నారు

**అవసరమైన పత్రాలు**

1.దరఖాస్తు ఫారం
2.రేషన్ కార్డు / ఫుడ్ సెక్యూరిటీ కార్డు
3.మరణించిన వ్యక్తి ఆధార్ కార్డు
4.కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు
5.పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు
6.మరణ ధృవీకరణ పత్రం
7.బ్యాంక్ ఖాతా మొదటి పేజీ జిరాక్స్
8.ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్

**9 మరణించిన వారి వయసు ధ్రువీకరణ పత్రం..చదువుకున్నవారైతే బోనఫైడ్ సర్టిఫికెట్ ఇతర స్టడీ సర్టిఫికెట్స్ ఇతరులు అయితే ఓటర్ కార్డ్ లేదా వయసు నిర్ధారణ పత్రాలు.**

తేది 13/04.2017... తర్వాత మరణించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. 19 సంవత్సరాల వయసు నుండి 59 సంవత్సరాల వరకు ఈ పథకం వర్తిస్తుంది. ఇతర వివరాలకై సంబంధిత పంచాయతీ కార్యదర్శి ని పూర్తి వివరాలు అడిగి సంబంధిత మీ సేవలో అప్లై చేసుకోవాలని చౌడాపూర్ బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు బి. శ్రీను అన్నారు.

## అకాల వర్షానికి తడిసిన జొన్న పంటను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే



**కంగ్టి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండలం పరిధిలోని జంగి (బి) గ్రామంలో రైతులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, గురువారం కురిసిన అకాల వర్షాలకు జంగి (బి) గ్రామ పరిధిలో కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉంచిన సుమారు 50 లారీల జొన్న పంట పూర్తిగా తడిసిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి,ఘటనాస్థలికి చేరుకొని తడిసిన జొన్న పంటను పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా భూపాల్ రెడ్డి మాట్లాడుతూ.."రైతులు నెలల తరబడి కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాల్సిన బాధ్యత ఉంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం, స్థానిక ఎమ్మెల్యే వైఫల్యం కారణంగా కొనుగోలు కేంద్రాల్లో జొన్నలు పేరుకుపోయి చివరకు వర్షానికి తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారు."

రైతుల కష్టాలు పట్టించుకోని ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో రైతుల కోసం పెద్ద పెద్ద హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు రైతులను గాలికొదిలేశారని విమర్శించారు.

స్థానిక ఎమ్మెల్యే రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో పూర్తిగా విఫలమయ్యారని, రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**తడిసిన జొన్న పంటను వెంటనే ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.**

నష్టపోయిన రైతులకు ఎకరాకు ప్రత్యేక పరిహారం ప్రకటించాలి.కొనుగోలు కేంద్రాల్లో ఉన్న అన్ని జొన్నలను తక్షణమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

"రైతుల పక్షాన భారత రాష్ట్ర సమితి ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం" అని భూపాల్ రెడ్డి స్పష్టం చేశారు. రైతు కన్నీరు కాంగ్రెస్ ప్రభుత్వ పాపం... రైతు నష్టానికి బాధ్యత ఎవరిది..?మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి తో పాటు సర్పంచ్ మాణిక్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంబాజీ రావు,సాయ గౌడ్,దత్తు రావు,దర్జీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేసారంలో ఘనంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జన్మదిన వేడుకలు

**కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు**



**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలంలోని కేసారం గ్రామంలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి స్పీకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు దప్పు ఆనందం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రజాసేవా దృక్పథం, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల పట్ల ఆయనకు ఉన్న అంకితభావాన్ని కొనియాడారు.ఈ సందర్భంగా గ్రామ సీనియర్ నాయకులు గడ్డమీది చంద్రయ్య ఉపాధ్యక్షులు లాయక్ అలీ, రామస్వామి, ప్రధాన కార్యదర్శి గుజ్జరి మహిపాల్ మాట్లాడుతూ..స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడని పేర్కొన్నారు. ఆయన మరిన్ని సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, గ్రామ పెద్దలు మరియు ప్రజలు భారీ ఎత్తున పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగి కేసారం గ్రామంలో పండుగ వాతావరణాన్ని తలపించింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ప్రజలకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది.

## గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక గ్రామ సభలు

- మండల వ్యవసాయాధికారి స్పెషల్ ఆఫీసర్ పరిమళ
- గోగ్య నాయక్ తండ సర్పంచ్ భాస్కర్ నాయక్, పంచాయతీ కార్యదర్శి మహేష్
- రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలి
- సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామసభ



**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** గ్రామాల గిరిజన తాండల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని, రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని,ఉపాధి హామీ పథకంలో ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి పరిమిల అన్నారు.99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చౌడాపూర్ మండల పరిధిలో గోగ్య నాయక్ తండ పంచాయతీలో సర్పంచ్ భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో మండల వ్యవసాయ అధికారి స్పెషల్ ఆఫీసర్ పరిమళ, పంచాయతీ సెక్రటరీ మహేష్ పాల్గొని గ్రామ ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.గ్రామసభలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఫిల్డ్ ఆఫీసర్ రూపీసింగ్,టీయల్ నరేష్,హెడ్ కానిస్టేబుల్ ఆనంద్ వార్డు సభ్యులు తాండవాసులు మహిళలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభల్లో సమస్యలపై చర్చ



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండలంలోని మాందాపూర్,రాంపూర్, వెంకట్రావుపేట, బహిరందిబ్బ గ్రామాల్లో 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని పరిష్కార మార్గాలపై చర్చించారు.కార్యక్రమంలో తహశీల్దార్ మల్లయ్య, వ్యవసాయ అధికారి రాజేష్, ఎంపీడీవో వేదప్రకాన్రెడ్డి,ఎంపీవో గంగారాం,సర్పంచ్లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## 50 శాతం సబ్సిడీపై జీలుగా విత్తనాలు

**వ్యవసాయ అధికారి ఏవో రాజేష్**

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండలంలో వానకాలం 2026 పంట కాలానికి రైతులకు 50% సబ్సిడీపై జీలుగా విత్తనాలు రేపటి నుంచి సరఫరా చేయనున్నట్లు ఏఓ రాజేష్ అన్నారు. మండలంలోని చిల్వర్ ఆగ్రోస్ రైతు సేవ కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని, 30 కేజీ బస్తా జీలుగా విత్తనాల ధర రూ. 2453 ఉండగా,ఒక్క బస్తా 2.5 ఎకరాలకు సరిపోతుందన్నారు. కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం ఆధార్ కార్డుతో అల్లాదుర్గం రైతు వేదికలో సంప్రదించాలన్నారు.



## ధాన్యం తరలించడం లేదని రోడ్డుపై రైతులు ధర్నా






**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నెల రోజులుగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన లారీల కొరతతో ధాన్యం తరలించడం లేదని ఆగ్రహించిన రైతులు గురువారం అల్లాదుర్గం ఐబి సమీపంలోని రోడ్డుపై వడ్లు పోసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన, వడ్లతోపాటు తూకం వేయని వడ్లు నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న సంబంధిత అధికారుల అలసత్వంతో పాటు లారీల కొరతతో ధాన్యాన్ని మిల్లులకు తరలించడం లేదని రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుల తరబడి వేచి చూస్తే దాన్యం తూకం వేసారని, ఇప్పుడు ఆ ధాన్యాన్ని తరలించేందుకు లారీలను పంపడం లేదని సంబంధిత అధికారులను నిలదీశారు.కొనుగోలు కేంద్రాల వద్ద రేయింబవళ్లు కాపలా కాయవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో వడ్లు తడుస్తున్న ప్రభుత్వం, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ లారీల కొరత ఉందని సాకులు చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ఈ విషయం తెలుసుకొని తాసిల్దార్ మల్లయ్య,సిఐ రేణుక,ఎస్ఐ శంకర్ , ఎంపీడీవో వేద ప్రకాష్ రెడ్డి, అల్లాదుర్గం బిఆర్ఎస్ పార్టీ పల్లె గడ్డ నరసింహులు. లు రైతులు ధర్నా చేస్తున్న ప్రదేశానికి చేరుకొని వారికి శాంతింపచేసేందుకు ప్రయత్నం చేశారు.ధాన్యాన్ని తరలించేదాకా రోడ్డుపై బైఠాస్తామని మొండికేయడంతో ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తామని వారు హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

## ఉపాధి హామీ కూలీలకు రైతన్నలకు మజ్జిక పంపిణి

**వాజేడు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండల కేంద్రంలోని గురువారం ధర్మవరం చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో సర్పంచ్ బెనిని,ఉప సర్పంచ్ సర్వేశ్వరరావు, గ్రామస్తులు బచ్చు సత్యనారాయణ, నరసింహ చారి ఆధ్వర్యంలో వంద రోజుల పనులు నిర్వహిస్తున్న కూలీలకు చల్లని మజ్జిగ పంపిణి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధి పొందిన వారంతా ప్రతిరోజు వందరోజుల పనికి హాజరు కావడం వల్ల కేంద్ర ప్రభుత్వం నుంచి 40 శాతం నిధులు రావడం వల్ల గ్రామంలో సీసీ రోడ్లు,డ్రైనేజీలు నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేసుకోవచ్చన్నారు. కూలీలు తప్పనిసరిగా పనులకు హాజరై గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని అవగాహన కల్పించారు. వేసవికాలంలో ఎండ తీవ్రతలు ఎక్కుగా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.






Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com